
# ప్రేమించింది ఎందుకంటే...




అప్పుడప్పుడే తెల్లవారుతుంది.

వంతెన దిగువలో సత్రం కింద ఆగింది ఒక ఒంటెద్దు బండి.

సామాన్లమూటల్తో ఆ బండిలోంచి దిగిన బిందెలకి మాట్లేసేవాళ్ళు దిగువలో ఉన్న సత్రంలోకి దిగేరు.

వాళ్ళలో ఆడమనిషైన గైరమ్మ గోనిసంచె మూటలిప్పి కుండలూ మండలూ బయటికి తీస్తా "చింతావారి కాఫీ హోటేల్లో టీ పోయించుకు పట్రా" అనేసి సీవండి చెంబిచ్చింది నాగరాజుకి.




గైరమ్మ చెప్పినట్టు టీ పట్టుకొచ్చేక ఎదురుగుండా ఉన్న గోదారి కాలవలోకి దిగి స్నానం చేసొచ్చిన నాగరాజు ఊళ్ళోకి బయల్దేరుతుంటే వెనక్కి పిల్చిన ముత్యం ''ఇవేళ ఎంత పని చెయ్యగలమో అన్ని సామాన్లే పట్టుకురారోయ్'' అన్నాడు.



అది విన్న ఆ సత్రంలో గంగిరెడ్ల సూరయ్య ''ఎందుకలా అంటన్నావ్?'' అనడిగేడు.

''ఆవేళ బాగు చెయ్యడానికి సరిపడ్డ సామాన్లే ఆవేళకి తెచ్చుకుంటాం. మాలాంటి సంచారవృత్తి చేసుకునే వోళ్ళు ఇవేళ పట్టికెళ్ళి రేపు పట్టుకొస్తాం అంటే ఎవరు నమ్ముతారు మమ్మల్ని?'' అన్నాడు ముత్యం.

నాగరాజుగాడలా ఊళ్ళో కెళ్ళగానే సత్రం ముందున్న గంగరాయి చెట్టుకింద కొలుం అంటించేడు ముత్యం. అది మండి సెగలు గక్కేలాగ తోలు తిత్తుల్లోకి గాలి లాగి నొక్కుతుంది



గైరమ్మ. మాట్లేసే పని మొదలైంది మరి.

మాట్లోళ్ళు వూళ్ళోకొచ్చి నెలరోజులు దాటింది.

ఒక సాయంత్రం గోదారికాలవలో మునిగి వస్తున్న ముత్యానికెదురయ్యేరు చింతా సుబ్బరాయుడుగారు ఆయన మావూళ్ళోనేగాదు మా చుట్టుపక్కలూళ్ళలో కూడా చాలా పేరూ పలుకుబడున్న మనిషి.''ఇంకా మా వూళ్ళో ఎన్నాళ్ళ పాటుంటార్రా?''అన్నాడు.

''ఇంకో నెల్లాళ్ళండి'' అన్నాడు ముత్యం.

''ఇక్కడ్నించి ఏవూరెళ్తారో?'' అన్నాడు సుబ్బారాయుడుగారు.

''పులగుర్తకీ మాఊరికీ మధ్యలో దూరవెంతరా

ముసలోడా ఇక్కడే ఉండి ఆవూళ్ళో తిరిగి సామాన్లు తెచ్చుకోవచ్చు గదా?'' అనడిగేడు సుబ్బరాయుడుగారు.

''తమరు చెప్పేది చాలా బాగుందిగానీ బాబుగారూ... ఆవూళ్ళో కాపరముండి చేస్తేనే ఆవూరోరికి నమ్మకం. అందుకే బాబయ్యా ఏవూళ్ళో పనుంటే ఆవూరు మకాం మార్చేది?'' అన్నాడు.

''అయితే ఓ పని చెయ్యి... ఈ చుట్టుపక్కల ఊళ్ళన్నీ తిరుగుతా ఆళ్ల సామాన్లకి పూచీగా నా పేరు చెప్పు'' అనేసెళ్ళిపోయేడు చింతా సుబ్బరాయుడుగారు.

ఆయన చెప్పినట్టే చేసిన ముత్యానికి ఆ చుట్టు పక్కలూళ్ళ జనవంతా బోల్డు పనిచ్చేరు. దాంతో మా ఊళ్ళోనే మూడ్నెల్లు ఉండిపోవాల్సొచ్చిందాళ్ళు.

* * *

పులగం రామారెడ్డిగారు భార్య మంగాయమ్మని ప్రేమించినంత ఇదిగా ఈ ప్రపంచంలో ఎవ్వర్నీ ప్రేమించలేదు. అయితే ఆవిడ ఒక ఆడపిల్లని కని కాలం చేసింది. ఆ పిల్లకి ప్రభావతి అని పేరు పెట్టుకున్న రామారెడ్డిగారు తన ప్రాణంలో ప్రాణంలాగ పెంచు కుంటున్నారు. అయితే పోయిన మంగాయమ్మగారి రూపం పెరిగిన ప్రభావతిలో అచ్చుగుద్దినట్టు కనపడుతుంది. దాంతో ప్రభావతంటే మరింత ప్రాణమయిపోయింది రామారెడ్డిగారికి.

ఆవేళ సాయంత్రం చల్లబడ్డాకా డాబామీద పెంచుకుంటున్న తులశమ్మకి నీళ్ళు పోస్తుంది ప్రభావతి. అక్కడికొచ్చిన రామారెడ్డిగారు ఆమాటా ఈ మాటా మాటాడేక ''నీకు మహేంద్రాడ తెల్సామ్మా?'' అన్నారు.

''తెలీదు నాన్నా'' అంది ప్రభావతి.

''రాయవరం పక్కనించెళ్ళాల్లే.. ఆవూళ్ళో చిన్నం పద్దయ్యగారని ఒకాయ నున్నారు. ఆళ్ళకి ఇద్దరు కొడుకులు ఒకబ్బాయి మెడ్రాసులో పళ్ళ డాక్టరు చదూతున్నాడు. ఆ సంబంధం నీకు నచ్చితే పెళ్ళయ్యేకా కుర్రోడ్ని ఇల్లరికం తెచ్చుకుందావనుకుంటున్నాను. వచ్చే ఆదివారం నిన్ను చూసుకోడానికొస్తున్నారు... ఇది చెప్పడానికొచ్చేనమ్మా'' అనేసి వెళ్ళిపోతున్న రామారెడ్డిగార్ని వెనక్కి పిల్చింది ప్రభావతి.

''ఏంటమ్మా?'' అన్నాడు ఆగిన రామారెడ్డి.

''ఒకవారం రోజుల్నుంచి మీకో మాట చెపుదామని అనుకుంటున్నాను నాన్నా'' అంది ప్రభావతి.

''ఏంటమ్మా అది... ఇప్పుడు చెపుతావా?'' అన్నాడు రామారెడ్డి.

''అవున్నాన్న'' అంది ప్రభావతి.

''ఏంటమ్మా?'' అంటా ఎర్రగచ్చు మీద చతికిలబడ్డాడు రామారెడ్డిగారు.

కాస్సేపు అదీ ఇదీ అంటా నాన్చిన ప్రభావతి చెప్పేసింది చివరికి. తను ఒక మనిషిని ప్రేమిస్తుందంట. ఎవరా మనిషీఅంటే బిందెలకి మాట్లు వేసేవాళ్ళ నాగరాజట. ఆ నాగరాజంటే పంచప్రాణాలంట ప్రభావతికి. అతనే ఆ పిల్లలోకమంట. అతను లేకపోతే తనకి కళ్ళు పోయినట్టంట. తనకి ఊపిరాగిపోయినట్టంట. ఊపిరి తీసి వదిలిన ప్రతీసారీ నాగరాజుని తల్చుకుంటుందంట. కళ్ళు గట్టిగా మూసుకుని ఇదంతా చెప్పేసిన ప్రభావతి పరిగెట్టుకుంటా అక్కడినించెళ్ళిపోయింది.

కూతురు చెప్పిందంతా విన్న రామారెడ్డిగారు ఆ రాత్రంతా అసలు నిద్రపోలేదు.

మర్నాడు పొద్దుట పన్లన్నీ కట్టి పెట్టేసేడు. తనకోసం వచ్చేవాళ్ళని రెండుమూడురోజుల పాటు రావద్దనేసేడు.

పెద్ద పాలేరు సత్తుంకాపుని పంపించి ఆ నాగరాజుని పిలిపించేడు.

గడగడ వణికిపోతున్న నాగరాజునికింద నించి పైదాకా చూస్తున్నాడు రామారెడ్డిగారు.

పొడుగాటి జుట్టు, ఒడ్డూ పొడుగూ బాగున్నాడు. నల్లగా నిగనిగలాడే శరీరంతో కండలు తిరిగున్నాడు. మంచి చాతీ, కళగల ముఖం, ఒత్తయిన కనుబొమ్మలు, కోరమీసాలు.

''సందలడేకా మళ్ళీ కబురు జేస్తాను ఎక్కడికీ ఎళ్లకు'' అని నవ్వుతా చెప్పి పంపించేసి పొలం ఎళ్ళిపోయి గొడ్లసావిడి పక్కన బోరింగుషెడ్డుని ఆన్చి ఉన్న గదిలోకెళ్లేడు. తనకోసం

కట్టించుకున్న గది అది. ఎప్పుడన్నా తాగాలనుకున్నప్పుడు కూతురికి తెలిస్తే బాధపడద్దని ఇక్కడికొచ్చి చేస్తుంటాడాపని.

ఆ గదిలోకెళ్ళి తలుపులేసేసుకున్న రామారెడ్డి ఆలోచనలో పడిపోయేడు. ఆ నాగరాజు అనే మనిషిలో ఏం జూసి ప్రేమించి ఉంటది ప్రభావతి? తన కూతురు ప్రభావతి మనసెలాటిదో నెమరేసుకుంటున్నాడు. ఊహ తెల్సినప్పట్నుంచి ఆ పిల్లదేన్నెలాగ ఇష్టపడిందదో, దేన్నెలాగ అసహించుకుందో గుర్తు చేసుకునే పని చేసేడు. దీపాలవేళదాకా అక్కడే కూర్చున్న రామారెడ్డిగారికి చివరికో ఆలోచన తట్టింది. ఆ ఆలోచన తన కొచ్చినందుకు తనలో తనే గొప్పగా సంబరపడిపోయి ఇంటికి బయల్దేరేడు.

* * *

రాత్రికి మాట్లోళ్ళ నాగరాజుని పిలిపించి మేడ మీద గదిలో ఉన్న ప్రభావతిని కూడా పిలిపించి ఆ నాగరాజుతో అన్నాడు రామారెడ్డి ''మా అమ్మాయి ప్రభావతి నా ఆరోప్రాణం. నిన్ను తప్ప ఈ ప్రపంచంలో ఇంకెవ్వర్నీ పెళ్ళి చేసుకోనంటుంది. మా ప్రభావతికి ఏదిష్టమో నాకు అదే ఇష్టం. మా ప్రభ కోరిక ప్రకారం నిన్నే ఇచ్చి చేస్తాను. అయితే ఒక ఆరునెలలపాటు నువ్వు నా అతిథిగా ఉండాలి. అతిథిగా ఉన్న ఈ ఆరునెలలూ మా అమ్మాయిని నువ్వు చూడకూడదు మా అమ్మాయికూడా నిన్ను చూడదు'' అని కరాకండీగా చెప్పేక, కూతురు కేసీ చూసి గోడకున్న భార్య మంగాయమ్మగారి ఫొటో దగ్గరకొచ్చిన రామారెడ్డి ''ఈ మనిషిమీద ప్రమాణం చేసి చెపుతున్నాను. ఇందులో ఎలాంటి కుట్రా లేదు తల్లీ'' అన్నాడు.

తల్లి ఫొటో మీద చెయ్యేసి తండ్రంత మాటంటే అదెంత గొప్పదో తెల్సిన ప్రభావతి ఏం మాటాడలేదు సరిగదా భయపడకండా ఒప్పేసుకో అని సైగ చేసింది నాగరాజుకి.

తలొంచుకున్న నాగరాజు ''సరే అలాగేనండి బాబయ్యా..తవరేం చెపితే అది చేస్తానండి'' అన్నాడు.

* * *

బోరింగుషెడ్డు పక్కనున్న తన గదిలో సామాన్లన్నీ బయటకి తీయించిన రామారెడ్డిగారు నాలుగుగోడలూ తగిలేలా ఇరవై అంగుళాల దళసరి బూరుగుదూది పరుపు కుట్టించి పరిపించేడు. దానిమీద ముఖమల్ దుప్పటి పరిపించి, బాలిసాలు వేయించేడు. చల్లగా ఉండటానికి రెండు పంకాలూ, నీళ్ళతో తడిపిన వట్టివేళ్ళు గది చుట్టూరా వేలాడదీయించేడు.

కాకినాడ మసీదు సెంటర్లో ఫేమస్ మిఠాయి కొట్టు సత్యాన్నీ, తాపేశ్వరం పోలిశెట్టి సుబ్బారావుగారి వీరాంజనేయస్వీట్ స్టాల్‌లో

కాజాలొండే మనిషిని పిలిపించి ''మీకెంత కావాలంటే అంత అడగండి. కానీ, ఆర్నెళ్లపాటు ఇక్కడే ఉండి మా నాగరాజుకి ఎలాంటి మిఠాయిలు కావాలో తెల్సుకుని ఆటిని వండి పెట్టాలి... అన్నీ నేతితోనే వండాలి సుమా'' అన్నాడు.

కూరగాయలతో వంటలు చెయ్యడంలో గోల్డుమెడలు తీసుకున్న రాజమండ్రి సుందరంగార్నీ, ద్రాక్షారంలో సత్యనారాయణ్ణీ, పలావు చెయ్యడంలో గప్పోడయిన రాయవరం కుంటోడ్నీ మావూరి కాలవదగ్గర కర్రిసుబ్బిరెడ్డిగారింట్లో వంటలక్రిష్ణనీ పిలిపించిన రామారెడ్డిగారు ''ఆర్నెల్లపాటు మీరు మా పొలంలో ఉండాలి. మీకెంతకావాలో అడిగి తీసుకెళ్ళండి. అయితే ఈ ఆర్నెళ్లలోనూ నాగరాజనే మా కుర్రోడికి ఏపూట ఏం కావాల్సొస్తే అది చేసి పెట్టాలి మీరు. ఆడేం అడిగితే అది. ఏటైములో అడిగితే ఆ టైములో వండి పెట్టాలి'' అన్నాడు.

వూళ్ళో సారా కుందయ్యనీ, కల్లు అమ్మే సూరమ్మనీ, రామచంద్రపురంలో పేరడైజ్ బ్రాందీషాపు ఓనరు బుల్లియ్యగార్నీ పిల్చి ''నాగరాజు ఎప్పుడు ఏవడిగితే అది పొయ్యాలి మీరు'' అన్నాడు.

గుడ్డిపట్టాభిని పిల్చి ''ఆడు బీడీలూ చుట్టలూ సిగరెట్లూ ఏవడిగితే అది ఇచ్చెయ్యి''అన్నాడు.

పొలం మధ్య మెట్టమీదున్న ఆ అతిధిగృహంలోకి అడుగెట్టిన మరుక్షణం నించీ నాగరాజుని రారాజులాగ చూసుకోడం మొదలెట్టేరు.

* * *

పందిరిమంచం మీద వెల్లకిలా పడుకున్న ప్రభావతి ఆ నాగరాజు రూపాన్నే నెమరేసుకుంటా మురిసిపోతుంది.

కృష్ణుళ్ళా ఎంత అందమైన రంగు నాగరాజుది? అంత అందమైన చెంపలు ఈ ఊళ్ళో ఏ కుర్రోడికున్నాయి? ఆ పెదాలూ, ఆ ఛాతీ, ఆ నడుమూ ఆ మనిషికున్నట్టు అసలెవరికీ లేవు. అంత అందమైన మనిషిని ఇంతకు ముందెప్పుడూ చూసెరగదు. అసలా నాగరాజు రూపం తల్చుకుంటుంటే అదోరకంగా అయిపోతుంది తను. శరీరమంతా ముఖ్యంగా నెవరగంత దగ్గర వెచ్చబడిపోతుంది.

ఆర్నెల్లూ ఎప్పుడు గుడుస్తాయా ఆ నాగరాజు ఎప్పుడు చూసేద్దావా అన్న ఆరాటంలో ఉంది ప్రభావతి. ఆరోజుకోసం ఎదురుచూస్తుంది ప్రభావతి.

* * *

మొత్తానికి ఆర్నెల్లు గడిచినియ్యి.

ఆవేళ మధ్యాన్నం.

ఎండకి తట్టుకోలేని మేకలు నిద్రగన్నేరు చెట్టు నీడలో నిలబడున్నాయి. పంటకాలవ మీదేసిన తాటి పట్టిమీద నిలబడి చేపలకోసం గేలం వేస్తున్నాడో కుర్రోడు. వుంతరేవుదాటేక కాలవ ఒడ్డున నిద్రగన్నేరు చెట్టు ఒంపు తిరిగి తన నీడని కాలవమీద పరుచుకుంది. వేపచెట్టూ రావిచెట్టూ మొగుడూ పెళ్ళాల్లాగా పెన వేసుకుని ఉన్నాయి.

మేడ మీద నిద్రపోతున్న కూతురు ప్రభావతిని పిల్చిన పులగం రామారెడ్డి ''అమ్మా!.. మీ అమ్మ పటం ముందు ప్రమాణకం చేసి ఆర్నెల్ల తర్వాత నాగరాజుని నీకిచ్చి పెళ్ళి చేస్తాను అన్నాను కదా?'' అన్నాడు.

''అవును నాన్నా'' అంది ప్రభావతి.

''చాలా సంతోషం మాయమ్మా... ఈ ఆర్నెల్లూ ఆ నాగరాజుని కన్నెత్తి చూళ్ళేదు. పన్నెత్తి పలకరించలేదు కదా పాపా?'' అన్నాడు.

''అవును నాన్నా'' అంది ప్రభావతి.

"నా మాటకి నువ్వింత గౌరవం ఇచ్చినందుకు చాలా ఆనందంగా ఉంది తల్లీ... నేనన్నమాట ప్రకారం మీ అమ్మమీద నేను ఒట్టు వేసిన ప్రకారం ఆ నాగరాజుకి నిన్ను ఇచ్చి పెళ్ళిచేస్తాన్రా... ఆ నాగరాజుని చూడాలని ఎన్నాళ్ళగానో నువ్వు పడ్తున్న ఆరాటాన్ని ఇన్నాళ్ళూ ఆపేసేను. ఒక్కసారి అతన్ని కల్సి రామ్మా" అని పొలం మధ్యలో నాగరాజు ఉంటున్న గెస్టవుస్ కెళ్ళడానికి సవ్వారీబండి సిద్ధం చేయించేడు రామారెడ్డిగారు.

ఎప్పుడు తన నాగరాజుని చూసేద్దామా అన్న ఉబలాటంతో ఉన్న ప్రభావతి పరుగెట్టుకెళ్ళి ఆ సవ్వారీబండిలోకి దూకేసింది.

కోరి శేషయ్యగారిల్లు దాటి, కరణాల గోడలు దాటి, చింతాలమ్మగుడీ, ఈంద్రపేట నల్లమిల్లి రాజారెడ్డిగారి పొలంలో గొడ్లసావిడీ దాటెళ్ళిపోతున్న సవ్వారీబండి కుడి పక్కనున్న పడాల రామారెడ్డిగారి దూళ్ళసావిడి ముందాగింది.

బోరింగుపెడ్డు పక్కనున్న గది దగ్గరకి గేలాపెత్తుకుంటా వెళ్ళిన ప్రభావతి అలాగుండిపోయింది నాగరాజుని చూసి.

నేతితో చేసిన జీడిపప్పు పాకాలూ, పాలకోవా బిళ్ళలూ, బాదం హల్వాలూ తెగమెక్కడం వల్ల, రాయవరం కుంటోడి మేక పలావులూ, కోడి ఇగుర్లూ లాగించెయ్యడం వల్ల, ద్రాక్షారం సత్యన్నారాయణ చేసే కైమా ఉండలూ, రెయ్యల వేపుళ్ళూ, కిళేల పులుసులూ, బొచ్చుచేపని చక్రాల్లా కోసివేసి ఉప్పూకారం నిమ్మరసం అద్ది అందించే వేపుళ్ళు ఆవురావురుమంటా లాగించెయ్యడం వల్ల, రాజమండ్రీ సుందరంగారి నేతి తాళింపుల్తో, పప్పుపులుసులు భోం చెయ్యడం వల్ల ఇంకో పక్కనించి కల్లూ, సారా, బ్రాందీ ఏది సయిస్తే దాన్ని గటగటా లాగెయ్యడం వల్ల.

పల్చని చెంపల్తో అందంగా ఉండే నాగరాజు ముఖం బుడగలాగ ఉబ్బిపోయి అసహ్యంగా తయారైంది. అందమైన వెడల్పాటి కళ్ళు బాగా ఉబ్బిపోయి రెప్పలకింద తిత్తుల్లాగ పెరిగి వేలాడ్తున్నాయి. పేద్దపొట్ట, బాగా వళ్ళొచ్చెయ్యడంతో ధాన్యం బస్తాలాగ తయారయ్యేడు. నడకే మారిపోయింది. వీటికి తోడు చుట్టాబీడీ సిగరెట్లూ బాగా కాల్చేయడంతో అందమైన పెదాలు నల్లగా మాడిపోయి ఆటిమీద తెల్లటి మచ్చలొచ్చేసి పరమ అసహ్యంగా తయారయ్యి నియ్యి.

రెప్పార్పకండా నాగరాజునే చూస్తున్న ప్రభావతి నేనిష్టపడింది ఈ రూపాన్ని కాదే అసలు ఈడ్ని కాదే అనుకుంది. ఇంకసలు ఆడ్ని చూడ్డమే పరమరోత అనిపించి పరుగెట్టుకుంటా వాళ్ళ ఇంటికెళ్ళిపోయి వాళ్ళనాన్నకి అదే చెప్పింది.

* * *